రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు మంగళవారం 1కిలోకి ఈ విధంగా ఉన్నాయి. టమాట రూ.23, వంకాయ రూ.35, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.50, బజ్జీమిర్చి రూ.45, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.45, క్యాబేజి రూ.23, బీన్స్ రూ.55, క్యారెట్ రూ.55, గోబిపువ్వు రూ.30, దొండకాయ రూ.40, చిక్కుడుకాయ రూ.55, గోరుచిక్కుడు రూ.55, బీట్‌రూట్ రూ.40, క్యాప్సికం రూ.55, ఆలుగడ్డ రూ.24, కీరా రూ.23, దోసకాయ రూ.18, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.19, కంద రూ.45, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ.22, మామిడికాయ రూ.15 నుంచి 20, అరటికాయ 10 నుంచి 11, చామగడ్డ 25, ముల్లంగి 6 నుంచి 8, చిలగడ దుంప 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 20 నుంచి 24, మునగకాయలు 10 నుంచి 12, బొప్పాయి 40, పుట్టగొడుగులు 45, ఎండుమిర్చి 160, అల్లం రూ.120, వెల్లుల్లి 160, చింతపండు రూ.160, పండుమిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పల్లికాయ రూ.55, లోబా రూ.40, ఆ కాకరకాయ 80 ధరలు ఉన్నాయి.

సన్మానించిన పీఏసీ చైర్మన్


హేమంత్‌ను సన్మానిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన గ్రూప్ 1 ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఎంపీడీవో ఉద్యోగానికి ఎంపికైన మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ నగర్ కాలనీకి చెందిన సిహెచ్. వి.ఎం. హేమంత్‌ను మంగళవారం పీఏసీ చైర్మన్ గాంధీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీవితంలో గొప్పగా రాణించాలంటే ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని అటువైపుగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, కావూరి అనిల్‌కుమార్, సైదేశ్వరరావు, వాసు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


జయంతి వేడుకల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ, జన్మభూమి కాలనీలో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోయ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి గొప్ప వ్యక్తి అని సంస్కృతి, సాహిత్యంలో పేరెన్నిక గల కవి అని అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వాటర్ వర్క్స్ మేనేజర్ యాదగిరి, జీహెచ్‌ఎంసీ వీధి దీపాల డీఈ స్వప్న అన్నారు. మంగళవారం హనుమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. సమావేశంలో బీజేపీ నాయకుడు తిరుపతి, అసోసియేషన్ సభ్యులు రాజు, మల్లేష్, నర్సింహరాజు, శ్రీధర్, శిరీష్, ఐలేష్, బాలరాజు, రమేష్‌గౌడ్, శంకర్, రవి, కనకయ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నిందితుడి రిమాండ్


హేమాశేఖర్‌రెడ్డి

మల్లాపూర్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి వద్ద ఆన్‌లైన్‌లో డబ్బులు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ పంపించి మోసం చేసి తిరిగి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని నాచారం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్‌కు చెందిన హేమాశేఖర్‌రెడ్డి (30) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కాగా మల్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1,0,0016లు తీసుకున్నాడు. నకిలీ ఆర్డర్ కాపీ ఇవ్వడంతో మోసపోయానని తెలుసుకుని నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం నాచారం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, ముఖ్య నాయకులు

కూకట్‌పల్లి: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కార్పొరేటర్‌లు, ఎర్రగడ్డ డివిజన్ ముఖ్య నాయకులతో మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గెలుపుకోసం సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్పొరేటర్‌లు అందరూ తమకు కేటాయించిన కాలనీలలో బూత్‌ల వారీగా ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి గత ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, నగరంతో పాటు తెలంగాణలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ ప్రజలకు జరిగిన నష్టాన్ని వివరించాలని సూచించారు. గల్లీ స్థాయిలో కార్నర్ మీటింగ్‌లు పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలన్నారు. పాదయాత్రలు చేపట్టి ప్రజల్లో, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపాలన్నారు.

శ్మశానవాటికల పనులు పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో శ్మశాన వాటికలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అధికారులకు సూచించారు. మంగళవారం అధికారులతో కలిసి హస్మత్‌పేటలోని హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలను పరిశీలించారు. రూ.1.20 కోట్ల వ్యయంతో జరుగుతున్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ శ్మశాన వాటికలో కోటి రూపాయలతో దహన వాటికలు, రూములు, మంచినీటి సౌకర్యం, డ్రెస్సులు మార్చుకోవడానికి రూములు, అంత్యక్రియల దగ్గర అందరు కూర్చోడానికి వీలుగా ఏర్పాట్లు చేయిస్తున్నామని అన్నారు. క్రిస్టియన్ శ్మశాన వాటికలో రూ. 20 లక్షలతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ నిఖిల్, ఏఈ ఆశా, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఫారెస్ట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ రమేష్, మేనేజర్ శివజ్యోతి, గణేష్ పాల్గొన్నారు.

భూగర్భ జలాల రీఛార్జ్ విధానాన్ని పరిశీలించిన మధ్యప్రదేశ్ బృందం



బాలానగర్: మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన 33 మంది సభ్యుల బృందం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా జలవనరుల విభాగం నిర్వహించిన కృత్రిమ భూగర్భ రీఛార్జ్ నిర్మాణాల క్షేత్ర ప్రదర్శనలో భాగంగా జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌ను మంగళవారం సందర్శించింది. జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో వివిధ ప్రదేశాలలో అనేక కృత్రిమ భూగర్భ జలాల రీఛార్జ్ నిర్మాణాలు ఉన్నాయి. సెంటర్ ఫర్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, ఫ్యాకల్టీ ఆఫ్ వాటర్ రిసోర్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ గిరిధర్ క్యాంపస్‌లో నిర్మించిన వివిధ రీఛార్జ్ నిర్మాణాలను చూపించి, వాటి సాంకేతిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో జలవనరుల అభివృద్ధి అధ్యాపకులు జి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో ఏసీ పేలి స్వల్ప గాయాలు

నిజాంపేట్: బాచుపల్లిలోని ఓ ఇంట్లో ఏసీ పేలిన సంఘటనలో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, చీరాలకు చెందిన జ్యోతి బాచుపల్లిలోని సాయి అనురాగ్ కాలనీ, ఎస్ఆర్‌కె ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటుంది. జ్యోతి (65) అప్పుడప్పుడు బాచుపల్లిలోని తాను ఉంటున్న ఫ్లాట్‌కి వచ్చివెళ్తుంటారు. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి వచ్చిన జ్యోతి బెడ్‌రూమ్‌లోని ఏసీ వేసుకుని నిద్రించింది. మంగళవారం ఉదయం వంట చేసుకునేందుకు వంట గదిలోని గ్యాస్ స్టవ్ వెలిగించగా.. ఒక్కసారిగా బెడ్‌రూంలోని ఏసీ పేలిపోవడంతో ఇల్లు అంతా మంటలు చెలరేగాయి. పెద్దశబ్దం రావడంతో ఇరుగు, పొరుగు వారు వచ్చి చూడగా జ్యోతికి స్వల్పగాయాలయ్యాయి. ఏసీకి సంబంధించిన వస్తువులు, కిచెన్‌లోని వస్తువులు, ఇంటి గోడలు, ఫర్నిచర్, సీలింగ్ ఫ్యాన్ అగ్నికి ఆహుతి అయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. హైడ్రా, ఫైర్, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'మనూ' దూరవిద్య కోర్సుల ప్రవేశాల గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూర విద్య కోర్సుల ప్రవేశాల గడువును ఈనెల 13 వరకు పొడిగించినట్లు సెంటర్ ఫర్ డిస్టెన్స్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజౌల్లాఖాన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 4 ఏళ్ల బీఏ(ఆనర్స్, బీకాం (ఆనర్స్), బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. దీంతో పాటు ఎంఏ ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్, అరబిక్, చరిత్ర, ఇస్లామిక్ స్టడీస్, డిప్లొమో కోర్సులైన జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, టీచ్ ఇంగ్లీష్, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్, ఉర్దూ, సర్టిఫికెట్ కోర్సులైన ఫంక్షనల్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ ద్వారా ఉర్దూలో ప్రావీణ్యం వంటి వాటిల్లో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్ 040–23008463 లేదా 040–23120600(ఎక్స్‌టెన్షన్ 2207,2208లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించినట్లు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపాల్ విజయభాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల నుంచి వచ్చిన వినతిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఈనెల 21 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా కరెక్షన్ విండో కూడా 22 నుంచి 25 వరకు ఛాన్స్ ఉందని ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్‌లో పరిశీలించాలని, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న 'ఇబ్బిడా' వేడుకలు


క్రీడల్లో తలపడుతున్న విద్యార్థులు

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ (ఎఫ్‌డీడీఐ–హెచ్ క్యాంపస్) లో 'ఇబ్బిడా–2025' పేరిట మంగళవారం క్రీడోత్సవాలను నిర్వహించారు. ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్‌రెడ్డి సమక్షంలో పంకజ్‌దివాన్, రామకృష్ణ, భవానీ కేడీయాతో కలిసి ప్రారంభించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు క్రీడలతో పాటు సాంస్కృతిక, కళాత్మక పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈడీ డాక్టర్ ఎన్‌తేజ్‌లోహిత్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా సాంస్కృతిక, కళాత్మక నైపుణ్యాలను వెలికి తీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపన

మోతీనగర్: మూసాపేట డివిజన్, అవంతినగర్ తోట షిరిడీ సాయిబాబా దేవాలయం గోపురానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు అవవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవం వేడుకలు బుధవారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు స్వాన్‌లేక్ అపార్టుమెంట్స్ దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. 8న ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోహణం, అఖండ దీపారాధన, ఋత్విక్ వరణము, పంచగవ్యపాసన, యాగశాల ప్రవేశము, నవగ్రహ, వాస్తు క్షేత్రపాల, యోగిని బ్రహ్మాది మండల స్థాపనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమంతో ప్రారంభమవుతాయని తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఏ అరుణ్‌కుమార్‌కు ఘన నివాళి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పద్మావతి నగర్ ప్రాంతంలో పారిశుద్ధ్య విభాగం ఎస్‌ఎఫ్‌ఏగా విధులు నిర్వహిస్తున్న ఏ. అరుణ్‌కుమార్ సోమవారం ఆయన నివాసంలో ప్రమాదవశాత్తు కాలుజారి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబిహా బేగం మంగళవారం అరుణ్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, ఎస్ఆర్‌పీ వడ్ల సురేష్ చారి, ఎస్‌ఎఫ్ఏలు మణెమ్మ, శివం, విష్ణు, నరేందర్, సురేష్, రవి, కార్మికులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిటిషన్ల పరిష్కారంపై దృష్టి సారించాలి

బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్

నిజాంపేట్: పిటిషన్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ అన్నారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, ప్రభుత్వ ఆస్తులు, స్టేషన్ రికార్డులు పరిశీలించారు. తనిఖీ సందర్భంగా డీసీపీ ప్రజలతో మాట్లాడి పోలీస్ సేవలపై వారి అభిప్రాయాలను సేకరించారు. ప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచి, సేవా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటించడంపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. కార్యక్రమంలో బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్


ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

నిజాంపేట్: మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ డ్రైవ్ జరిగింది. ఈ డ్రైవ్‌లో భాగంగా నిజాంపేట్ హనుమాన్ దేవాలయం నుంచి నిజాంపేట్ ఎక్స్‌రోడ్డు వరకు రోడ్డుపై ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలగిస్తున్న చిల్లర వ్యాపారుల స్టాళ్లు, తాత్కాలిక కట్టడాలను కూడా అధికారులు తొలగించారు. భవిష్యత్తులో కూడా తరచుగా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ


పనులను పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, అధికారులు

ఆల్విన్‌కాలనీ: రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి గాజుల రామారం వరకు చేపడుతున్న 100 ఫీటత్ల రోడ్డు విస్తరణ పనులను ఇంజినీరింగ్, విద్యుత్, అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి గాజులరామారం వెళ్లే ఎల్లమ్మబండ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 100 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగిందన్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఈఈ గోవర్ధన్, ఏఈ శ్రావణి, ఏఈ నిఖిల్, విద్యుత్ విభాగం అధికారులు డీఈ జనప్రియ, ఏడీఈ ప్రసాద్, శ్యామ్, ఏఈ చైతన్య, యూబీడీ డిప్యూటి డైరెక్టర్ శివ జ్యోతి, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి బస్తీబాట


అధికారులను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, తులసీనగర్‌లో ఎలక్ట్రికల్ అధికారులు ప్రజా సమస్యలపై మంగళవారం బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై అధికారులకు వివరించారు. ముఖ్యంగా వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, అతుకులతో కూడిన విద్యుత్ వైర్లు, లో ఓల్టేజ్ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను వివరించారు. సమస్యలను సానుకూలంగా విన్న అధికారులు ప్రణాళికాబద్ధంగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ నాయక్, లైన్‌మెన్లు వెంకటేశ్వరరావు, రమేష్, కాలనీ వాసులు సిద్దారెడ్డి, శ్రీనివాస్, బుచ్చిబాబు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్యాచ్ వర్కు పనుల పరిశీలన


రోడ్డు ప్యాచ్ వర్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీ బస్టాప్ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంతలు పడింది. ప్యాచ్ వర్కు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంతలు పడిందని, దీనివల్ల వాహనదారులు కిందపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యుల సమాచారం మేరకు రోడ్డు ప్యాచ్ వర్కు పనులు చేపట్టామని తెలిపారు. అదే విధంగా పలు కాలనీలలో ప్రజల నుంచి వచ్చిన వినతి మేరకు, తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సిబ్బంది, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


ఐఈఈఈ చైర్ ఫర్ రిలేషన్స్ సీతారామ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

దుండిగల్: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని హైదరాబాద్ ఐఈఈఈ చైర్ ఫర్ రిలేషన్స్ సీతారామ్ తాడేపల్లి, యునిసన్ త్రీ ఎక్స్ టెక్నికల్ హెడ్ డాక్టర్ అతుస్‌రాయ్ చౌదరి అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఐఈఈఈఇ) డే ను మంగళవారం దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్ ఐటీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినర్జీ ఆఫ్ మైండ్స్, ఇంజనీరింగ్, మెడిసిన్, అండ్ పవర్ ఆఫ్ స్టాండర్స్ థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని తన అనుభవనాలను, ఇంజనీరింగ్, శాస్త్ర సాంకేతికత సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయో మెడికల్ పరికరాలు, టెలిమెడిసిన్ అభివృద్ధి తదితర అంశాలపై జరిగిన చర్చలో విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఐక్యూఏసీ హెడ్ రాధికాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ కొనసాగుతూ!

కుత్బుల్లాపూర్: సుచిత్ర నుంచి కొంపల్లి వరకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. సంవత్సర కాలంగా ఇక్కడ పనులు కొనసా...గుతూ ఉన్నాయి. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతుంది. సంబంధిత శాఖ అధికారులు ఈ విషయంపై నిర్లక్ష్యం వహించడం మూలంగా ప్రతిరోజు ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మత్యువాత పడుతున్నారు. మరికొంతమంది తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సుమారు 400 కోట్ల రూపాయలకు పైగా నిధులు వెచ్చించి ఇక్కడ నాలుగు ఫ్లైఓవర్ లో నిర్మాణంతో పాటు అండర్ పాస్ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు. ఆ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేళల్లో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పేట్‌బషీరాబాద్ డీమార్ట్ వద్ద నిలిచిన పనులు

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు


శ్రీశైలంగౌడ్‌ను కలిసిన కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ తదితరులు

కుత్బుల్లాపూర్: పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి శ్రీశైలంగౌడ్‌ను కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. తమ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.